

ఉద్దేశం ఉన్నతం.. ఫలితం కార్పొరేట్‌కి !

- ప్రభుత్వం ఊడిగం
- ప్రభుత్వ బడుల విద్యార్థులకు అందని షైనింగ్ స్టార్ అవార్డులు
- అయోమయంలో తల్లిదండ్రులు
- మండల, జిల్లా స్థాయికి తెలియకనే విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి -పుంగనూరు: పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు ఇచ్చి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఈ అవార్డులు ప్రదానం చేస్తారు. అవార్డుకు ఎంపికైన విద్యార్థులకు రూ. 20 వేలు నగదు, పథకం, సర్టిఫికెట్ అందిస్తారు. పదో తరగతి మండల స్థాయిలో ఆరుగురిని ఎంపిక చేస్తారు. వీరిలో ఓసి, బీసీలు ఇద్దరేసి చొప్పున ఎస్‌సి, ఎస్‌టి ఒక్కొక్కరు చొప్పున ఎంపిక చేస్తారు. అదనంగా జిల్లా స్థాయిలో 70 శాతానికి పైగా మార్కులు సాధించిన ప్రత్యేక అవసరాలు కలిగిన ముగ్గురు విద్యార్థులను అవార్డుకు ఎంపిక చేస్తారు. నిబంధనలు చెప్పడానికి, వినడానికి చక్కగా ఉన్నాయి. ఇందుకు భిన్నంగా విద్యార్థుల ఎంపిక ప్రక్రియ సాగిందనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. పథకం గొప్పదే అయినా కార్పొరేటుకు ఫలితం దక్కేలా ఊడిగం చేసేలా వుందని పలువురు విమర్శిస్తున్నారు. అవార్డులకు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను ఎంపిక చేసి షైనింగ్ స్టార్స్ అవార్డు కార్పొరేటు పాఠశాలల ఉన్నతికి మరింత ఉపయోగపడే విధంగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ బడుల విద్యార్థులకు మోసం

చిత్తూరు జిల్లా పుంగనూరు మండల ప్రభుత్వ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎంపిక విధానం నిదర్శనమని తేటతెల్లమవుతోంది. పుంగనూరు పట్టణంలో 589 ఆపై వచ్చిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో ఎంతో మంది వున్నారు. ప్రభుత్వ విద్యార్థులను ఎంపిక చేయకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసంది. ఇదేమిటని మేధావులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదివిన విద్యార్థులకు 589 మార్కులు వచ్చిన విద్యార్థులను ఎంపిక చేసి రివార్డులు, అవార్డులు, ఇవ్వడం ఎందుకని. దీన్ని ప్రోత్సహించడం వెనుక ఏ ఉద్దేశం దాగి వుందో? అని పలువురు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలి తప్ప ప్రైవేట్ విద్యార్థులకు ఎందుకు రివార్డులు ఇవ్వాలని, అదే మార్కులు వచ్చిన ప్రభుత్వ విద్యార్థులను వెనుక బాటు గురి చేయడం, ప్రభుత్వ పాఠశాలను క్రమం క్రమంగా మూసివేసే దురుద్దేశాలు ఉన్నట్లు తెలుస్తోందని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వ అవార్డుల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పెద్దపీట వేయాలి తప్ప ప్రైవేట్ విద్యార్థులను ప్రోత్సహించి జిల్లా స్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు ఎందుకు చేస్తున్నారని అనుమానం వ్యక్తం అవుతుంది. ఈ విషయమై పుంగనూరు మండలంలో నేడు ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డులో వెనుకబడిన విద్యార్థులకు అదే మార్కులు వచ్చినా ఎంపిక కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఓసి క్యాటగిరిలో 589 వచ్చిన ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 589 పొందిన వెనుకబడిన తరగతుల విద్యార్థులను ఎందుకు ఎంపిక చేయడం లేదని పలువురు బాహాటంగా విమర్శిస్తున్నారు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

అయోమయంలో తల్లిదండ్రులు

ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులు వెనుకబడిన తరగతుల విద్యార్థులు చదువుతున్నారు. వాళ్లని ప్రోత్సహించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలే తప్ప ఇలాంటి అవార్డులు ఇచ్చి ప్రైవేట్ పాఠశాలలను ప్రోత్సహించడం ప్రభుత్వం కార్పొరేట్‌కు ఊడిగం చేయడమేనని ఈ విధానం ఇలాగే కొనసాగితే ప్రభుత్వ పాఠశాలలు క్రమం క్రమంగా మూసివేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ప్రతి మండలానికి ఓసి 2, బీసీ రెండు, షెడ్యూల్ తెగలు ఒకటి, షెడ్యూల్ కులాలు ఒకటి ఇవ్వాలి. కానీ ఒకే ప్రైవేట్ పాఠశాల చెందిన ఓపెన్ క్యాటగిరీలో 589 ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వెనుకబడిన విద్యార్థులను ఎందుకు తప్పించారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ప్రభుత్వ పథకాల వల్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులలో మానసిక ఆత్మస్థైర్యం దెబ్బతిని తిరిగి ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయిస్తారని, ప్రభుత్వ కార్యక్రమంలో ఏ పథకమైనా మొదట ప్రభుత్వ విద్యార్థులకు ప్రథమ స్థానం ఇవ్వాలని, ఇలా ప్రైవేట్ పాఠశాలలను ఏ ఉద్దేశంతో ప్రోత్సహిస్తున్నారని, ఇకనైనా ప్రభుత్వ విద్యార్థులకు న్యాయం చేసి మండలాల వారీగా అత్యధిక మార్పులు పొందిన విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని పలువురు కోరుతున్నారు. పుంగనూరు మండలంలో ఒక్క ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను కూడా ఎంపికగా చేయకపోవడం దీని ఉద్దేశం ఏమిటో చెప్పాలని అధికారులను పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమానికి ఇలాంటి అవార్డులు ప్రకటించి వాటి అభివృద్ధికి ప్రత్యక్షంగా సహకరిస్తుందనడానికి ఇది ఒక నిదర్శనంగా మారింది.

నష్టపోయిన ఉపాధ్యాయులకు
రీ కౌన్సెలింగ్ చేసి న్యాయం చేయాలి

- నేడు డీఈఓ కార్యాలయం ముట్టడి
- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కౌన్సెలింగ్‌లో వెబ్ ఆప్షన్ కారణంగా ఉపాధ్యాయులకు నష్టం కలిగిందని తిరిగి రీ కౌన్సెలింగ్‌చేసి న్యాయం చేయాలని లేదంటే ఆదివారం డీఈవో కార్యాలయాన్ని ముట్టడించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు శనివారం పిలుపు నిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ గత మే నెల 19,20న పాఠశాల విద్యా కార్యదర్శి కోన శశిధర్ సమక్షంలో సాగిన చర్చల సందర్భంగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టడానికి అంగీకరించారని, కానీ ఎస్‌జిటి లకు మళ్లీ వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలని శుక్రవారం రాత్రి ఎనేబుల్ చేయడం ఇచ్చిన హామీని ఉల్లంఘించడం అవుతుందన్నారు. అంతే కాక ప్రధానోపాధ్యాయులు, స్కూలు అసిస్టెంట్లకు ఇప్పటి వరకు నిర్వహించిన బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియలో అనేక సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తడం వల్ల చాలా మంది ఉపాధ్యాయులు నష్టపోయారని, సాంకేతిక సమస్యల వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని పాఠశాల విద్య కార్యదర్శి సమక్షంలో ఇచ్చిన హామీ మేరకు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. క్లస్టర్ లెవెల్ అకడమిక్ టీచర్ ఖాళీలను మొదట ఆప్షన్లో చూపించి తర్వాత బదిలీ ఉత్తర్వులు జనరేట్ చేసే ముందు సదరు ఖాళీలను తొలగించడంతో చాలా మంది సుదూర ప్రాంతాలకు బదిలీ కావలసి వచ్చింద న్నారు. క్లస్టర్ లెవెల్ అకడమిక్ టీచర్ ఖాళీలతో కలిపి ముందు ఇచ్చిన ఆప్షన్స్ మేరకు బదిలీ ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు. చాలా మంది ఉపాధ్యాయులు రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకున్నా బదిలీల వెబ్ సైట్‌లో తప్పనిసరి బదిలీగా చూపడంతో వారు బదిలీలకు ఆప్షన్ ఇచ్చుకోలేకపోయారని తెలిపారు. తుది సీనియార్టీ జాబితాలు విడుదల చేయకుండా, ఉపాధ్యాయుల గ్రీవెన్స్ పరిష్కారం కాకుండానే ఆప్షన్స్ పెట్టుకోవాలని ఒత్తిడి చేయడంతో చాలా మంది ఉపాధ్యాయులు నష్టపోయారన్నారు. చాలా మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఎంపిక చేసుకున్న ఖాళీలను కేటాయించకపోవడంతో తర్వాత సదరు ఖాళీలను ఉద్యోగోన్నతులలో చూపడం వల్ల సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోయారన్నారు. కొన్ని ఖాళీలను సీనియర్ ఉపాధ్యాయులు ముందు బదిలీ కోసం ఎంపిక చేసుకున్న ప్పటికీ వారికి కేటాయించకుండా జూనియర్లకు కేటాయించారన్నారు. కొన్ని పాఠశాలల్లో ఒక పోస్టు ఖాళీగా ఉండగా ఆ ఖాళీ పోస్టును ఇద్దరు ఉపాధ్యాయులకు కేటాయించడం వల్ల కొంత మంది ఉపాధ్యాయులు నష్టపోయారని తెలిపారు. ప్రాధాన్యత కేటగిరి ఉపాధ్యాయులు వారి ప్రాధాన్యతను రద్దు చేసుకుని జనరల్ కేటగిరి కింద దరఖాస్తు చేసుకుని ఆప్షన్స్ ఇవ్వగా ఎంపిక చేసుకున్న స్థానాలను వారికి కేటాయించకుండా జూనియర్లకు కేటాయించారన్నారు. బదిలీ ఉత్తర్వులు 22లో పేర్కొన్న నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్న కొన్ని నిర్ణయాల ఫలితంగా కొంతమంది ఇబ్బందులు ఎదుర్కొ న్నారన్నారు. పనిచేస్తున్న యాజమాన్యంలో బదిలీ అని తెలిపి రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకున్న వారిని తప్పనిసరి బదిలీగా ప్రకటించడం, ఇచ్చిన హామీకి అను గుణంగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని, సాంకేతిక తప్పిదాల వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పక్షాన కోరుతు న్నామన్నారు. ఈ సమస్యలు పరిష్కరించకుంటే ఆదివారం డీఈవో కార్యాలయాల ముట్టడికి పిలుపు నిస్తున్నామన్నారు. వెంటనే ఎస్‌టిలకు మాన్యువల్ కౌన్సెలింగ్, ఇతర సాంకేతికపరమైన సమస్యలు పరిష్క రించాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపుల భాగంగా నేడు ముట్టడి చేపడుతున్నామని, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు అపస్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ బాలాజీ, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి వి రమణ, ఎస్టియు జిల్లా అధ్యక్షులు ఎన్ ఆర్ మదన్ మోహన్ రెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ మణి గండన్, పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ భాస్కర్ రెడ్డి, వైఎస్ఆర్‌డిఏ జిల్లా అధ్యక్షులు ఎం గోవిందస్వామి, ప్రధాన కార్యదర్శి జయకాంత్, అపస్ తిరుపతి జిల్లా అధ్యక్షులు నాగరాజ, పిఆర్‌టియు వర్కింగ్ ప్రసిడెంట్ నరేంద్ర రెడ్డి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఏకాంబరం, ఎస్‌టియు నాయకులు చంద్రన్, నష్టపోయిన ఉపాధ్యాయ బాధితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు .



ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

రేపు బోయకొండ వద్ద యోగాంధ్ర : కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చౌడేపల్లి మండలం బోయకొండ దేవస్థానం వద్ద యోగాంధ్ర నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా పర్యటకశాఖ అధికారిని ఆదేశించారు. శనివారం కలెక్టర్ యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణపై వివిధ శాఖల అధికారులు ఆయుష్ నోడల్ అధికారులు, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లుతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్రలో భాగంగా పర్యాటక ప్రాంతాలలో యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో భాగంగా గతంలో కాణిపాకం, పులిగుండులో కార్యక్రమాలు నిర్వహించారని సోమవారం చౌడేపల్లి మండలం బోయకొండ దేవస్థానం వద్ద ఉదయం 7 నుండి 8 గంటల వరకు కార్యక్రమ నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలనన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమం లో భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


విద్యుత్ షాక్‌తో మృతి చెందిన త్రినాథ్

ప్రజాశక్తి-తవణంపల్లి: విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన తవణంపల్లి మండలంలో శనివారం చోటు చేసుకుంది. తవణంపల్లి ఎస్ఐ చిరంజీవి కథనం మేరకు.. తవణంపల్లి మండల పరిధిలోని ఉత్తర బ్రాహ్మణపల్లి హరిజన వాడలో వుంటున్న త్రినాథ్ (25) ఉత్తర బ్రాహ్మణపల్లి గ్రామంలో ఉదయం 10.30 గంటలకు వెళ్లాడు. తన ఇంటి ముందు వున్న రేకుల షెడ్డులో వున్న పేపర్ ప్లేట్ తయారు చేసే మెషిన్‌ని రీపేర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. అక్కడే వున్న స్థానికులు అతడిని గమనించి చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి కి తీసుకు వెళ్లగా జీ త్రినాథ్ అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి బి గోవిందయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు తవణంపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఎమ్మెల్యేకు బాధను వివరిస్తున్న చిన్నారుల కుటుంబ సభ్యులు


చిన్నారుల మృతి చాలా బాధాకరం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వి కోట : మండల పరిధిలోని కృష్ణాపురం పంచాయతీ మోట్లపల్లికి చెందిన ముగ్గురు విద్యార్థులు మూడురోజుల క్రితం చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందిన విషయం విదితమే.. దీంతో స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మండల టిడిపి నాయకులతో కలసి శనివారం మోట్లపల్లిలో బాధిత కుటుంబాలను కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా సంఘటన జరిగిన తీరును మృతుల కుటుంబీకులు వివరించి తమ గోడును వివరించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారుల మృతి తనను తీవ్రంగా కలచి వేసిందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ధైర్యంగా ఉండాలని వారిని ఓదార్చారు. పుత్ర శోకాన్ని కలిగించే ఇలాంటి సంఘటనలను గుర్తించి పిల్లల పట్ల తల్లి దండ్రులు అప్రమత్తతో పాటు జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. బాధిత కుటుంబీకులకు అండగా ఉంటామని వారిలో భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో రంగనాథ్, రాంబాబు, ఈశ్వర్ గౌడ్, ధీరజ్, శబరీష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- నదిలో మునిగి ఇద్దరు పిల్లలు మృతి
- పెళ్ళకూరులో ఘటన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): ఈత సరదా ఇద్దరు చిన్నారుల ప్రాణాలను బలిగొంది. ఈ విషాద ఘటన తిరుపతి జిల్లా పెళ్ళకూరు మండలం కలవకూరు స్వర్ణముఖి నదిలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి పోతే.. శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్తరాశిపాలెంలో లక్ష్మికి కలవకూరులో బంధువులు ఉన్నారు. తరచూ అక్కడికి వెళ్లి వస్తుంటుంది. ఈ క్రమంలో స్వర్ణముఖి నదిలోని చెక్ డ్యామ్ పై నీరు పారడాన్ని గుర్తించింది. ఈ నేపథ్యంలో చంద్రగిరి మండలం సత్తారుబైలు నుంచి వేసవి సెలవులకు శ్రీకాళహస్తికి వచ్చిన మనమరాలు(కూతురు బిడ్డ) నందినిని తీసుకుని ఆటవిడుపుగా ఉంటుందని కలవకూరు చెక్ డ్యామ్ కు ఆటోలో బయలు దేరింది. ఈ సమయంలో తామూ వస్తామనీ చుట్టుపక్కల పిల్లలు మారాం చేయడంతో వారినీ వెంట తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో నదిలోని చెక్ డ్యామ్ వద్ద ఈత కొడుతుండగా నందిని(7), లిఖిత్(14) ఇసుకలో కాళ్లు కూరుకు పోయి, పైకి రాలేక, ఉపిరి ఆడక మృతి చెందారు. కొనఊపిరి ఉంటుందేమోనన్న అనుమానంతో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో చిన్నారుల మృతదేహాలను వారి వారి స్వస్థలాలకు తరలించారు. లిఖిత్ ది శ్రీకాళహస్తి పట్టణంలోని సాలిపేట కాగా, తండ్రి దీనదయాళ్ ల్యాంకో పరిశ్రమలో సెక్యూరిటీ గార్డ్ గా పనిచేస్తున్నారు. చిన్నారుల మతి వార్త తెలుసుకుని ముత్తారాశి పాలెం, సాలిపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. నందిని మృతదేహాన్ని సత్తారు బయలు లో ఉన్న తండ్రి రమేష్ కు అప్పగించారు. పెళ్లకూరు మండల పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.





బాలికపై వేధింపులు

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి -బంగారుపాలెం: ఓ బాలికను వివాహం చేసుకోవాలని వేధించిన కేసులో వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. తుంబ పాల్యం గ్రామానికి చెందిన మోహన్ కుమారుడు వడ్డే దేగయ్య (28) అదే గ్రామానికి చెందిన ఓ బాలికను పెళ్లి చేసుకోవాలని వేధించాడు. బాలిక తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాము పోక్సో కేసు నమోదు చేశామని నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామని పోలీసులు తెలిపారు.

రైల్వే పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం రైల్వే స్టేషన్ పరిధిలో పలు రైళ్లు, ప్లాట్‌ఫాంలో రైల్వే పోలీసులు విస్తృత తనఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రయాణికుల బ్యాగులను, లగేజీలను తనిఖీ చేశారు. అక్రమ రవాణాను అరికట్టడానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. గంజాయి, రేషన్ బియ్యం, ప్రభుత్వ నిషేధిత వస్తువులు రైళ్లలో తీసుకెళ్లడం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే పోలీసులు

ఈద్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ శనివారం ముస్లిం సోదరులతో కలిసి ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. నగరపాలక పరిధిలోని ప్రశాంత్ నగర్, గిరింపేట ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రశాంత్ నగర్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బక్రీద్ పర్వదినాన అల్లా ఆశీస్సులతో ముస్లింలు సుఖ సంతోషాలతో జీవించాలని, ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలన్నారు. మసీదుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, ఈద్గా వద్ద బోరు తవ్వకం, ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ముస్లిం సోదరులకు ఎప్పుడు ఏ అవసరం ఉన్నా, సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. కులాలు, పార్టీలు, మతాలకు అతీతంగా అందరికీ మంచి చేయాలన్నదే తన ఉద్దేశమని, మంచి చేయడానికి రాజకీయాల్లోకి వచ్చామన్నారు. అనంతరం ముస్లిం సోదరులు, చిన్నారులకు బక్రీద్ శుభాకాంక్షలు చెప్పి ఆప్యాయంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, వసంత్ కుమార్, కాజూరు బాలాజీ, ముస్లిం మత పెద్దలు, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.


ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌రెడ్డి

మామిడి గుజ్జు పరిశ్రమలను తెరిపించండి

- తోతాపురిని కొనుగోలు చేయించండి
- జిల్లా అధికారులకు ఎంపీ సూచన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: మామిడి రైతుల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలను తూచ తప్పకుండా పాటించాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు జిల్లా యంత్రాంగానికి శనివారం ఒక ప్రకటనలో ఓ సూచించారు. గుజ్జు పరిశ్రమలను తెరిపించి, మామిడి రైతుల నుంచి తోతాపురిని కొనుగోలు చేయించి, వారికి నష్టం వాటిల్లకుండా చూడాలని జిల్లా అధికారులకు సూచించారు. తోతాపురి మామిడి టన్నుకు రూ.12 వేల రూపాయలు ప్రకటించిన ఏపీ సీఎం చంద్రబాబుకు ఎంపీ దగ్గుమళ్ళ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. తోతాపురి మామిడికి మద్దతు ధరను 12 వేల రూపాయలుగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో.. శనివారం ఆయన హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తుందని కొనియాడారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా అధికారులు పక్వానికి వచ్చిన మామిడికాయలను మాత్రమే ప్రాసెసింగ్ కంపెనీలకు పంపించే అంశంపై మామిడి రైతులకు అవగాహన కల్పించడంలో హార్టికల్చర్, అగ్రికల్చర్, అసిస్టెంట్లు, క్షేత్రస్థాయిలో విస్తృతంగా పని చేయాలన్నారు. జిల్లాలోని ఏపీ గుజ్జు పరిశ్రమలు పనిచేస్తున్నాయనే రోజు వారి వివరాలను డిస్‌ప్లే చేయించాలని, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు దిగుమతి అయ్యే మామిడి రవాణాను రాష్ట్ర సరిహద్దుల వద్ద నిఘా ఏర్పాటు చేసి, నియంత్రించాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. అదే సమయంలో ప్రాసెసింగ్ కంపెనీల వద్ద పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు అంచనా వేసి, మామిడి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. మామిడి రైతుల నుంచి గుజ్జు పరిశ్రమలు తోతాపురిని కొనుగోలు చేయించడంతోపాటు, ప్రభుత్వం, కలెక్టర్ సూచించిన సూచనల ప్రకారం మామిడి రైతులకు మద్దతు ధరను ఇప్పించే బాధ్యతను అధికారులు తీసుకోవాలన్నారు. అప్పుడే మామిడి రైతులకు మేలు చేసిన వారు అవుతామని, ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు.

ఈశాన్యేశ్వర ఆలయంలో రాజీవ్ కనకాల దంపతులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ తిరుమల నగర్ లో ఉన్న ఈశానేశ్వర ఆలయాన్ని ప్రముఖ సినీనటులు రాజీవ్ కనకాల, సుమ దంపతులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కేతారి సహదేవ, ఆలయ అర్చకులు వారికి ఘనంగా స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ యాంకర్ సుమ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో శ్రీవారి పాదాల చెంత అద్భుతమైన నవలింగాలతో ఈశానేశ్వర ఆలయం నిర్మించడం అద్భుతంగా ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా నవగ్రహాలను శివలింగాల రూపంలో ప్రతిష్ఠించడం విశేషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేతారి ప్రహ్లాద, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రాజీవ్ కనకాల, సుమ దంపతులను టిడిపి నాయకులు మర్రిపాటి సతీష్ సత్కరించారు.

తాగునీటి సమస్య పరిష్కారం


బోరుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం అన్నెమ్మ గారి పల్లి పంచాయతీ వడ్డి రామాపురంలో నెలకొన్న తాగునీటి సమస్యను పంచాయతీ కార్యదర్శి లలిత కుమారి ఆధ్వర్యంలో శనివారం పరిష్కరించారు. గ్రామంలోని ప్రజలకు తాగునీటిని అందించే బోరు మోటారు మరమ్మతుకు గురి కావడంతో మూడు రోజుల పాటు ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడ్డారని ఆ తర్వాత బోరు నుండి మోటారు తీసి బాగు చేయించి శనివారం మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీటిని దించారని తెలిపారు. ప్రజలు తాగునీటిని వృథా చేయకూడదని పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.

మదర్ థెరిసా విద్యార్థినులకు రాష్ట్ర ప్రతిభ అవార్డు

ప్రజాశక్తి- గంగవరం: మదర్ థెరిసా విద్యా సంస్థ విద్యార్థినులు ముగ్గురు విద్యార్థులు ఇంటర్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ అవార్డుకు ఎంపికయ్యా రని ఆ కళాశాల కరస్పాండెంట్ డాక్టరు యం రవీంద్రబాబు తెలిపారు. ఎంపికైన విద్యార్థులలో ఎంపిసికి చెందిన సాయిబ్రింద వెయ్యి మార్కు లకు 990 మార్కులు, అదే గ్రూపునకు చెందిన భాను వెయ్యి మార్కులకు 989, ఎంఈసిలో గౌసియ భాను వెయ్యికి 979 మార్కులు సాధిం చారు. వీరికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజయవాడ లో ప్రతిభ అవార్డులను అందించారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి, అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.


రాష్ట్ర స్థాయిలో ప్రతిభ అవార్డులు పొందిన విద్యార్థినులు

'అలెన్'తో ప్రైవేట్ కాలేజీలు 'అలయన్స్'

- ఎస్ఎఫ్ఐ స్టింగ్ ఆపరేషన్‌లో వెలుగులోకి...
- ఒక్కో విద్యార్థికి 3లక్షల 39వేలు వసూలు

ప్రజాశక్తి - తిరుపతి

తిరుపతి జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో కోచింగ్ మాఫియా రాజ్యమేలుతోందన్న విమర్శలు ఎస్ఎఫ్ఐ ఆధారాలతో సహా బయట పెట్టింది. తక్షణమే ఇలాంటి కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, రవి, ఆఫీసు బేరర్స్ వినోద్, అశోక్, తేజ డిమాండ్‌చేశారు. తిరుపతి నగరంలో కోచింగ్ మాఫియాలు ప్రైవేట్ జూనియర్ కాలేజీలతో చేతులు కలిపాయి. అలెన్ కెరియర్ ఇన్‌స్టిట్యూట్ కోట, రాజస్థాన్ పేరుతో 'నీట్ యూజీ-జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్, ఒలంపియాడ్స్ 6వ తరగతి నుంచి 12వ తరగతి పేరుతో తిరుపతి నగరంలో కోచింగ్ మాఫియాను ప్రారంభించింది. ఈ కోచింగ్ మాఫియాతో రాజు జూనియర్ కాలేజీ (09382), శ్రీనివాస జూనియర్ కాలేజీ (09316) చేతులు కలిపి లక్షా యాభైవేల నుంచి 3 లక్షల 30వేల వరకూ ఫీజులు వసూలు చేస్తున్నాయి. రాజు జూనియర్ కాలేజీ (09382) ఎయిర్ బైపాస్‌రోడ్డు బజాజ్ షోరూమ్‌పైన డేస్కాలర్స్ విద్యార్థుల నుంచి లక్షా 50వేలు ఫీజు వసూలు చేస్తోంది. శ్రీనివాస జూనియర్ కాలేజీ (09316) తిరుపతి రూరల్‌లో అలెన్ హాస్టల్ క్యాంపస్ తరగతులు నిర్వహిస్తూ ఒక్కో విద్యార్థి నుంచి మూడు లక్షలు వసూలు చేస్తోంది. హాస్టల్ కోసం లక్షా 20వేలు, అలెన్ ఫీజు లక్షా 67వేలు, శ్రీనివాస జూనియర్ కాలేజీ (ఇంటర్) 37వేలు, దోబీ ఫీజు ఐదువేలు, సెక్యూరిటీ డిపాజిట్ పదివేలు కలిపి మొత్తం 3 లక్షల 39వేలు ఒక్కో విద్యార్థి నుంచి వసూలు చేస్తుండటం గమనార్హం. ఏ ప్రైవేట్ జూనియర్ కళాశాల అయినా బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ అనుమతితో నడుస్తుంటే ఆ ప్రైవేట్ జూనియర్ కళాశాల ఎటువంటి ప్రైవేట్ కోచింగ్ సెంటర్లతో ఒప్పందం చేసుకోకూడదు. అలెన్ కోచింగ్ మాఫియాతో ఒప్పందం చేసుకుని రాజు, శ్రీనివాస జూనియర్ కాలేజీలు నిబంధనలకు వ్యతిరేకంగా చెలామణి అవుతున్నాయి.గతంలో అనేకమార్లు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపామన్నారు. అయినా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోలేదు. ఇకనైనా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఆర్ఐఓ రాజశేఖర్‌రెడ్డి ఈ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వివేకానంద విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు



షైనింగ్ స్టార్ అవార్డులు పొందిన వివేకానంద విద్యార్థులు

ప్రజాశక్తి-శాంతిపురం: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన వివేకానంద పాఠశాల విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికయ్యారు. మే నెల 23న వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాల 82.35 శాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో నిలిచింది. ఆ పాఠశాలకు చెందిన కే భవ్య 574 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. ఏ సాహిత్య అంజుమ్ 568 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. మండల టాపర్లుగా నిలవడంతో పాటు షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపిక కావడంతో వీరికి వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ ఆశ శంకరప్ప, పాఠశాల హెడ్మాస్టర్ అమ్మో మాలతి అభినందనలు తెలిపారు. రాళ్ళబుదుగురు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన స్పందన కూడా ఈ అవార్డులకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం తెలిపారు.



P NAKSHATRA 468/470 STATE FIRST

K.PRAJWALA 468 / 470 STATE FIRST

ఇంప్రూమెంట్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఇంటర్మీడియట్ ఇంప్రూమెంట్ ఫలితాల్లో చిత్తూరు నగరంలోని మురుగాన్పల్లి వద్ద వున్న శ్రీ పిఎస్ఎన్ వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నాగరాజు శెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 సప్లిమెంటరీ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రజ్వల 468, నక్షత్ర 468 రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించగా జ్యోతి రాజ్ 466, లక్ష్మీ ప్రసన్న466, తారిక నాలని ప్రవళిక , జ్యోతిష్ , జీవిత, ప్రవీణ్ ,గణేష్ ,మోక్షిత్ రెడ్డి, పద్మేష్, జాహ్నవి 470 మార్కులకు 465 సాధించారని తెలిపారు. తమ కళాశాలలోని విద్యార్థులు సప్లిమెంటరీ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు తెలిపారు. బైపీసీ విభాగంలో పౌర్ణమి, శ్రీనిధి, రూప 440 మార్కులకు 425 మార్కులు సాధించారని, సి ఈసీ భాగంలో దీప 443, సంజయ్ 439 సాధించారని తెలిపారు. ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నాగరాజు శెట్టి అభినందించారు.



విజయం విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: శనివారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాల్లో విజయం జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారని విజయం విద్యా సంస్థల అధినేత తేజోమూర్తి తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో రాజశ్రీ , పవన్ కుమార్ , ప్రణీత 479 మార్కులకు 466 మార్కులు సాధించారని, జోత్న్స 429, ఎంఇ సియు విభాగంలో డింపుల్ భవ్య శ్రీ 492, సీఈసీ విభాగంలో సోమంత్ కుమార్ 484 మార్కులు సాధించారన్నారు. 450 కంటే అధికంగా 80 మంది విద్యార్థులు 400 మార్కులు కంటే తక్కువ మంది విద్యార్థులు సాధించాలని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన అధ్యాపకులను విజయ విద్యా సంస్థల అధినేత తేజం మూర్తి అభినందించారు.




విద్యార్థులను అభినందిస్తున్న శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల కరస్పాండెంట్లు

సప్లిమెంటరీలో శ్రీ వివేకానంద విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంటు పరీక్ష ఫలితాల్లో శ్రీ వివేకానంద విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కళాశాల కరస్పాండెంట్లు భాస్కర్ నాయుడు, మహేంద్ర కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంటు ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు సాయి లహరి , భవిష్యవాణి , వైష్ణవి బిందు సాయి, బాలాజీ 470 మార్కులకు 466 సాధించారన్నారు. బైపీసీలో గౌతమి 434, షారోన్ షారోన్ 432, జాస్మిన్ 429, గ్రీష్మ 429, శైలజ 424సి ఈసీ విభాగంలో చందు 469, ఢిల్లీ రాణి 465, రిహానా 443 మార్కులు సాధించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అధ్యాపకులను కళాశాల కరస్పాండెంట్లు అభినందించారు.

మధు, శ్రీవాణి విద్యార్థుల ప్రభంజనం



ప్రజాశక్తి -గంగవరం: ఇంటర్ ఇంప్రూవ్‌మెంట్ ప్రథమ సంవత్సర ఫరీక్షా ఫలితాలలో మధు, శ్రీవాణి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మార్కులతో పాటు అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించారని కళాశాల చైర్మన్ కే. కృష్ణమూర్తి రెడ్డి తెలిపారు. ఈ ఫలితాలలో ఎంపీసీలో కే .సానియా 470కు 465 , రిజ్వాన 470కు 464 మార్కులు, కే. సుచరిత 470కు 463 మార్కులు, ఆర్ యశశ్రీ 470కు 463 మార్కులు సాధించారు. తస్లిం 470కు 462 మార్కులు పొందారు. సుమంత్ 470కు 461 మార్కులు , మంజు శ్రీ 470కు 460 మార్కులు , అభిబఫర్హీం 470కు 460 మార్కులు పొందారని తెలిపారు. బైపీసీలోజి. సమీరా 440కు 434 , సాజియా 440కు 432 మార్కులు, సిఈసిలో పి .ప్రీతి 500కు490 మార్కులు పొందారన్నారు. టీఎస్. ఫాతిమా500కు 489, తేజశ్రీ 500కు 482 మార్కులు , కుసుమ 500కు 480 మార్కులు , నిజాం 460 మార్కులు సాధించారని తెలిపారు. ఎం ఇ సిలో కవిత 500కు 486 మార్కులు, కాజల్ 500కు 480 మార్కులు పొందారన్నారు. యమునా 500కు 460మార్కులు సాధించారు. ఈ ఫలితాలలో ప్రథమ సంవత్సరంలో 400 పైగా 107 మంది విద్యార్థులు సాధించారు. ఇంతటి విజయానికి కారకులైన విద్యార్థులను ,వారి తల్లిదండ్రులను ,అధ్యాపక బృందాన్ని కళాశాల ప్రిన్సిపాల్ సిపి .శ్రీవాణి అభినందించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



జిడి నెల్లూరులో

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మండలంలో ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం తూగుండ్రం పంచాయతీ ఆవలకొండలోని పలువురు ముస్లింల చిన్నారులు, యువకులు, పెద్దలు మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరి కొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ అబ్బాసియా కమిటీ అధ్యక్షుడు నియాజ్‌అలీ, వైస్ ప్రసిడెంట్ ఇక్బాల్, సెక్రెటరీ రెహమత్, ట్రెజరర్ షాకిర్, జాఫర్ అలీ, అలీ అబ్బాస్, బాబు పాల్గొన్నారు.



పలమనేరులో

పలమనేరు: స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన బక్రీద్ వేడుకలలో ముస్లిం సోదరులతో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు స్వీట్స్ తినిపించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఖాజా పీర్, చాంద్ బాషా, అమానుల్లా, మా బాష, ఇక్బాల్, షకీల్, మౌలా, నదీమ్, బాబాజాన్, అస్లాం పాల్గొన్నారు.

పలమనేరు: బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఈద్గా మైదానంలో ఉదయం 6.30 కే ప్రార్థనలు ప్రారంభమై 7.45 గంటలకు ముగించారు. శనివారం మండలంలోని నమాజ్ చేపట్టారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.



బైరెడ్డిపల్లిలో

బైరెడ్డిపల్లి: భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండగను ముస్లిం సోదరులు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరికి ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదు వద్దకు చేరుకున్న మాజీ సర్పంచ్ జైకుమార్, వారి సతీమణి, మాజీ ఎంపీపీ , ఐరాల కృష్ణవేణి, ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విందులో పాల్గొన్నారు.



పుంగనూరులో

పుంగనూరు: ర్యాలీ నిర్వహించి ఈద్గా మైదానం వద్ద ప్రార్థనలు చేశారు.ఉదయం ఆరు గంటల పది నిమిషాలకే మదీనా మసీదు, ఈద్గా మైదానం, నానాసాబ్ పేట మసీదు, రాంపల్లి వద్ద ఈద్గామైదానం, నౌలక్ తోట ప్రాంతాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రార్థన లలో ఇమామ్ అల్లా ఉపదేశాలను తెలిపారు.



సోమలలో

సోమల: సోమలలో ర్యాలీ నిర్వహించి ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని పేదలకు నగదు, తీపి మిఠాయిలు పంచిపెట్టారు. కందూరు పెద్ద ఉప్పరపల్లి నంజంపేట వంగసాని వారి పల్లి నవాబుపేట ఇరికిపెంట గ్రామాలలో మసీదులలో ప్రార్థనలు చేసి పండుగను ఘనంగా జరుపుకున్నారు.



బంగారుపాళ్యం: భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండగను ముస్లిం సోదరులు శనివారం మండలంలోని పాలేరు ఈద్గాలో నిర్వహించారు. ఉదయం ముస్లిం సోదరులు నమాజ్ చేసి ఒకరికొకరికి ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



'శ్రీ లక్ష్మీ నరసింహ'కు నాలుగు అవార్డులు

ప్రజాశక్తి- కార్వేటినగరం : కార్వేటినగరం లోని శ్రీ లక్ష్మీనరసింహ హైస్కూల్ విద్యార్థులు ఏపీ ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్స్ అవార్డులో ఆరు అవార్డులకు నాలుగు అవార్డులు శ్రీ లక్ష్మీనరసింహ కైవశం చేసుకుని మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఇంతటి విజయాన్ని పాఠశాలలకు అందించిన విద్యార్థులు విశ్వావిష రాయల్ 580, మోహిత్ సాయి 573, నాగేశ్వరి 568, మోహిత్ రెడ్డి 552, అవార్డులు కైవసం చేసుకున్నారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకున్న శ్రీ లక్ష్మీనరసింహ విద్యార్థుల పాఠశాల డైరెక్టర్లు అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లతా, పాఠశాల డైరెక్టర్లు దిలీప్, ధనంజయ రెడ్డి, వెంకటేష్ పురుషోత్తం పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల సమీపంలోని బంగారు తిరుత్తణి ఆలయం వద్ద మూడు రోజులుగా నిర్వహించిన కార్యక్రమాలలో గోపుర ఆవిష్కరణ, ధ్వజస్తంభ ప్రతిష్ట, మయూర వాహనంపై ఊరేగిన ఉత్సవ మూర్తుల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో బంగారు తిరుత్తణి కొండపై నూతనంగా నిర్మించిన గోపురం ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి 9 గంటల నుండి ఒంటిగంట వరకు సోమల పురవీధులలో శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పుష్ప పల్లకిలో ఊరేగించగా ప్రజలు కర్పూర హారతులు అందించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు ప్రజలు పాల్గొన్నారు.

అక్రమ గ్రావెల్ క్వారీ ఆపకపోతే అడ్డుకుంటాం : సిపిఐ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: చిత్తూరు జిల్లా నగరి రూరల్ మండలం గుండ్రాజుకుప్పం దళితవాడ ఆనుకుని ఉన్న గ్రావెల్ క్వారీలో పరిమితికి మించి గ్రావెల్ మైనింగ్ చేయడంతో పాటు, జాతీయ రహదారుల పనులకని కుంటిసాకులు చెబుతూ, తమిళనాడుకు తరలించి డబ్బులు దండుకుంటున్న క్వారీ యజమానులకు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ వార్నింగ్ ఇచ్చారు. స్థానికులతో కలిసి సిపిఐ నేతలు శనివారం క్వారీ ప్రాంతంలో పర్యటించారు. పరిమితికి మించి గ్రావెల్ తవ్వకాలు చేపట్టడంలో భాగంగా ఇష్టానుసారంగా బాంబ్‌బ్లాస్టింగ్ చేయడంతో గుండ్రాజుకుప్పం దళితవాడలోని ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయన్నారు. రాజకీయ అండదండలతో అక్రమంగా నడుపుతున్న యజమానులు తక్షణమే ఆపేయాలని, లేకపోతే దళితవాడ ప్రజలను భారీ ఎత్తున సమీకరించి మిషన్లను పగలగొడతామని హెచ్చరించారు.

మహిళలను కించపరిచే సంస్కృతి వైసీపీది

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మహిళలను కించపరిచే సంస్కృతిని కొనసాగించిన వైసీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, ప్రతిపక్ష హోదా లేకపోయినా ఆ ఫందాను ఇప్పుడు కొనసాగిస్తున్నారని, రాబోయే రోజుల్లో వైసీపీకి ఒక్క సీటు మాత్రమే వస్తుందని టిడిపి చిత్తూరు జిల్లా పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ, ఎస్సీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కుమారమ్మ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అమరావతి రాజధాని ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్ది, అభివద్ధి పథంలో ముందుకు నడపాలని ప్రయత్నిస్తున్న సీఎం చంద్రబాబు సంకల్పంపై బురద జల్లడానికి వైసీపీ శ్రేణులు కుట్రపన్నారన్నారు. జగన్‌కు చెందిన టీవీ ఛానల్లో ఓ డిబేట్ కార్యక్రమంలో కష్ణంరాజు అనే వ్యక్తి అమరావతి చుట్టుపక్కల ప్రాంతాల రైతులు సెక్స్ రాకెట్లు నడుపుతారని చెప్పడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా మహిళా లోకం భగ్గుమందన్నారు. 2019 నుండి 2024 వరకు రాష్ట్రంలో విధ్వంసక పాలన చేసిన జగన్మోహన్ రెడ్డికి మహిళల విలువ తెలియదని, అమరావతి రాజధాని నిర్మాణానికి ఎంతోమంది మహిళలు స్వచ్ఛందంగా తమ భూములను ఇచ్చారని గుర్తు చేశారు.

అన్న ప్రసాదానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన తేజ్ గణేష్ కుటుంబ సభ్యులు రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని డీడీ రూపంలో ఆలయాధికారులకు అందజేశారు.




నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

వెబ్ కౌన్సెలింగ్ వద్దు..


ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి -కార్వేటినగరం: 'వెబ్ కౌన్సెలింగ్ వద్దు.. మాన్యువల్ కౌన్సెలింగ్ ముద్దు..' అని ఉపాధ్యాయ సంఘ నాయకులు శనివారం సాయంత్రం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఇచ్చిన పిలుపు మేరకు ఎంఆర్‌సి భవనం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే నెల 19, 20వ తేదీలలో పాఠశాల విద్యా కార్యదర్శితో ఉపాధ్యాయ సంఘాలు నిర్వహించిన చర్చల్లో ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలని కోరడంతో అందుకు అంగీకరించారన్నారు. కానీ ఎస్జీటీలకు నిన్న రాత్రి నుండి వెబ్ ఆప్షన్స్ ద్వారా కౌన్సెలింగ్ జరుగుతుందని చెప్పడం దారుణంగా ఉందని, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘ జిల్లా నాయకులు నాగేంద్రరాజు, సర్దార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గురవయ్య, శివాజీ, జగదీశన్, రఘురామకృష్ణ, వేణు, లక్ష్మీపతీ, మనోజ్ కుమార్, హరి, సునీత, వాసు, గంగాధరం, ఈశ్వరయ్య పలువురు పాల్గొన్నారు.

కామిడీకేలో శ్రీ పిఎస్ఎన్ వివేకానంద ఆల్ ఇండియా ర్యాంకు



K. TEJA
PERCENTILE: 99.499
RANK : 585



P. SAHITHE
PERCENTILE 97.316
RANK : 3059

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కామిడీకేలో శ్రీ పిఎస్ఎన్ వివేకానంద కళాశాల ఆల్ ఇండియా ర్యాంక్ సాధించినట్లు కరస్పాండెంట్ సత్యనారాయణ , ప్రిన్సిపాల్ నాగరాజ్ శెట్టి తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లా డుతూ పిఎస్ఎన్ వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు శుక్రవారం ప్రకటించిన ఫలితాల్లో కే తేజ 585, సాహితి 3059, యోహిత్ సాయి 3,325, గణేష్ 3730, వినీత్ 3,735, అనీష్ 6,702 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించేందుకు కృషి చేసిన విద్యార్థులు, అధ్యాపకులకు కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు.

పాడి రైతుల అభివృద్ధికి తోడ్పాటు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పెద్దపంజాణి: రాష్ట్రంలోని పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడుతుందని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. మండలంలోని కోగిలేరు, వీరప్పల్లి పంచాయతీ కేంద్రాలలో శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పాడి రైతులకు రాయితీపై దాణా పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం పాడి పరిశ్రమకు ప్రాధాన్యతిస్తూ పశుదానాను రైతులకు రాయితీపై కూటమి ప్రభుత్వం పంపిణీ చేస్తుందని అన్నారు. గతంలో కరువులోను పాడి రైతులకు గడ్డిని సరఫరా చేసి చంద్రబాబు పాడి రైతులను ఆదుకున్నారని గుర్తు చేశారు. పాడి పరిశ్రమకు అధిక ప్రాధాన్యతను ఇచ్చింది టిడిపి ప్రభుత్వమేనని గతంలో నిర్వహించిన పథకాలను రైతులకు గుర్తు చేశారు. వ్యవసాయం పాడి అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి పలమనేర్ ప్రాంతం చాలా అనుకూలమైందని మహిళలు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలన్నారు. పాడిని అభివృద్ధి చేసేందుకే ప్రభుత్వం రాయితీ, సబ్సిడీ పథకాలను అమలు చేస్తోందని ఆయన తెలిపారు. అనంతరం పలువురు రైతులకు 50 శాతం రాయితీతో దాణాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో తహశీల్దారు అనిల్ కుమార్, ఎంపీడీవో బాలాజీ, వెటర్నరీ డాక్టర్ వినీత కుమారి,మాజీ ఎంపీపీ విజయ భాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఆనంద్, ప్రధాన కార్యదర్శి



చలపతి,నాయకులు మురహరి రెడ్డి, సుధాకర్ రెడ్డి, రోజారెడ్డి,సర్పంచ్ లు రమేష్ బాబు,పార్వతమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అభిమానం


ఎన్నికల అనంతరం తొలిసారి వీరప్పల్లి సొంత పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే అమర్నాథ రెడ్డికి పంచాయతీ వాసులు మంగళ హారతులతో స్వాగతం పలికి ఎనలేని అభిమానాన్ని చాటుకున్నారు. వీరప్పల్లి గ్రామస్తులతో పాటు పంచాయతీవాసులు పెద్ద ఎత్తున స్వాగత ఏర్పాట్లను చేపట్టారు. పంచాయతీ వాసులు తనపై చూపిన అభిమానానికి ఎమ్మెల్యే ఆనందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం పంచాయతీ టిడిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే 'అమ్మ్యాక్ట్స్ విశిష్టత: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -వి కోట: పేద, మధ్యతరగతి వర్గాల ఉపాధే లక్ష్యంగా, సేవే పరమా వధిగా భావించి అమ్మ్యాక్ట్స్ ముందు కెళ్లడం అభినందనీయమని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం (లిమిటెడ్) 28వ వార్షికోత్సవం సీఈఓ డాక్టర్ జి దశరథ రెడ్డి అధ్యక్షతన శనివారం వి కోటలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ పొదుపులతోనే మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి స్వయం సమృద్ధి సాధిస్తారన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని పొదుపు విషయంలో మహిళల పనితీరు భేష్



అని ఆయన మెచ్చుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలను స్థాపించి మహిళలకు పొదుపులను అలవాటు చేయించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. నేడు బ్యాంకులు మహిళా సంఘాలకు విరివిగా అప్పులు ఇచ్చేందుకు ముందుకు రావడానికి ప్రధాన కారణం మహిళలు బ్యాంకులకు కల్పించిన నమ్మకమేనని కొని యాడారు. ఇంటికో మహిళా పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. మారుమూల ప్రాంతా ల్లో మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే ఆ కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్న నమ్మ కాన్ని సాకారం చేసేందుకు అత్యంత వెనుకబడిన ప్రాంతా లైన వికోటలో స్వచ్ఛంద సంస్థ స్థాపించి గ్రామాల్లో మహిళలను సంఘా లుగా ఏర్పాటు చేసి వారిలో చైతన్యాన్ని నింపి అంచెలంచెలుగా ఎదిగి నేడు ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న దశరథరెడ్డి సేవలు అమోఘమన్నారు. సేవలతో పాటు విద్యా రంగానికి వారు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నా రని జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసులు కొనియాడారు. గతంలో కరోనా సమయంలోనూ అమ్మ్యాక్ట్స్ సంస్థ తమ ఖాతా దారులకు, సామాన్య ప్రజలకు సేవలు అందించడాన్ని ఆయన అభినందించారు. సీఈఓ దశరధి రెడ్డి మాట్లా డుతూ ప్రతి



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి, సిఇఓ దశరథ రెడ్డి , జెడ్‌పిచైర్మన్ శ్రీనివాసులు

సంవత్సరం తమ సంస్థ సభ్యుల పిల్లలు చదువులను ప్రోత్సహించేందుకు ఉపకార వేతనాలు అందిస్తున్నామని దీని ద్వారా ఎంతోమంది ఉన్నత స్థానాలకు చేరుకున్నారని, తమకు అది ఎంతో గర్వ కారణమన్నారు. ఉత్తమ విద్యార్థు లకు పురస్కారాలు అందించి సత్కరించారు . పొదుపు సంఘాల మహిళలకు మెగా చెక్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరన్న, ఎంఈఓ చంద్రశేఖర్ తో పాటు మండల టిడిపి అధ్యక్షుడు రంగనాథ్, నేతలు రాంబాబు, ఈశ్వర్ గౌడ్ , ధీరజ్, శబరీష్ సంస్థ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

37,500 రూపాయల నగదు స్వాధీనం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం సల్లాపురం వడ్డిపల్లి చంద్రశేఖర నాయుడు మామిడి తోటలో పేకాట ఆడుతున్నారన్న ముందస్తు అందిన సమాచారం మేరకు ఎస్సై శివశంకర్ తన సిబ్బందితో కలిసి దాడి చేయగా ఆరుగురు పేకాట రాయుళ్ల పట్టుబడగా 37,500 వారి వద్ద నుండి నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. వడ్డి పల్లెకు చెందిన కే వెంకటరమణ , పెద్దపంజాణికి చెందిన రమణారెడ్డి, కృష్ణప్ప, చౌడేపల్లికి చెందిన ఆర్ హరినాథ్, జి రామచంద్రయ్య అలియాస్ జి ఆర్ చంద్ర, ఇరికిపెంటకు చెందిన సుందర్ రాజు శనివారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు వెళ్లి అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకుని పేకాట ముక్కలను స్వాధీనం చేసుకుని వ్యక్తులను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రమేష్, రామకృష్ణ, సురేష్ , నాగరాజు పాల్గొన్నారు.



రైతుల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలంలోని రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలను మాజీ ఎంపీటీసీ, వెదురుకుప్పం టిడిపి నేత మోహన మురళి శనివారం రైతు భరోసా కేంద్రంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది దయాకర్, వెటర్నరీ సిబ్బంది గణేష్, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సెక్యూరిటీ వసూళ్లపై బృందమ్మ ఫైర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన ఒక సెక్యూరిటీ గార్డు భక్తుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తుండగా స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తల్లి బందమ్మ శనివారం రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఆయన్ను తీవ్రంగా మందలించారు. ఆయనపై అధికారులకు ఫిర్యాదు చేయడంతో విధుల నుంచి తొలగించారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి సతీమణి బందమ్మ శనివారం శ్రీకాళహస్తి పట్టణంలో పలుచోట్ల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తిరిగి స్వగ్రామమైన శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వెళుతూ శివయ్య గోపురం వద్ద ఉన్న షెడ్లను పరిశీలించారు. అక్కడ విధి నిర్వహణలో ఉన్న సెక్యూరిటీ గార్డు సుబ్రమణ్యం నాయుడు షెడ్లలో నిద్రించే భక్తుల నుంచి 20 రూపాయలు వసూలు చేస్తుండడాన్ని గమనించారు. ఆయనపై తీవ్రంగా మండిపడ్డారు. అతడిని అక్కడి నుంచి తరిమేశారు. సెక్యూరిటీ గార్డు భక్తుల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే విధుల నుంచి అధికారులు ఆయన్ను తొలగించారు.

మాజీ అదనపు ఈవో ధర్మారెడ్డిని సిట్ విచారించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి అంశంపై సిట్ అధికారులు టీటీడీ మాజీ అదనపు ఈవో ధర్మారెడ్డిని విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని జనసేన నేత కిరణ్ రాయల్ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీవారికి ప్రీతిపాత్రమైన ప్రసాదంగా చెప్పబడే లడ్డులో కల్తీ నెయ్యిని వినియోగించి కోట్లాదిమంది భక్తులకు సరఫరా చేశారని, దీని వెనుక ఉన్న కుట్ర దారులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కింది స్థాయి ఉద్యోగులను ఇబ్బంది పెట్టకుండా, అసలు సూత్రధారులను సిట్ అధికారులు కొనుగోళ్ల కమిటీ వారిని కూడా విచారణ పరిధిలోకి తీసుకోవాలని కోరారు. కల్తీ నెయ్యి అంశం వెనుక ఒకరిద్దరు మీడియాకు సంబంధించిన వారు, బోర్డు సభ్యులు కూడా ఉన్నారని సంచలనంగా మాట్లాడారు. కల్తీ నెయ్యి అంశం మతపరమైన దాడిగానే పరిగణిస్తున్నామన్నారు.

ట్రంప్ విధానాలపై ప్రపంచ వ్యాప్త వ్యతిరేకత

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ట్రంప్ విధానాలతో ఇండియాతో పాటు పలు దేశాలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుందని ద్రవిడ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ కె.వి చలం పేర్కొన్నారు. శనివారం సాయంత్రం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్ లో సిపిఐ ఆధ్వర్యంలో ట్రంప్ విధానాలు భారతదేశంలో ప్రభావం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ నేపథ్యంలో సరళీకరణ, ప్రపంచీకరణలో భాగంగా ఫ్రీ ట్రేడ్ మార్కెట్ కొనసాగిస్తున్న తరుణం లో ట్రంప్ సుంకాలు పెంచడంతో ప్రపంచవ్యాప్తంగా కూడా వ్యతిరేకత వ్యక్తమవుతోందని అన్నారు. మోడీ విధానాలు గమనిస్తే ఉగ్రవాదుల అణిచివేత కన్నా ఆయన రాజకీయ లబ్ది కోసమే ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. టెర్రరిస్టులను, మావోయిస్టులను అంతం చేసామని ప్రకటించిన మోడీ బీహార్‌లో ఇంకా అయిపోలేదు ఈ పరంపర కొనసాగుతుందని చెప్పడం కేవలం ఎన్నికల లబ్ది కోసమేనని విమర్శించారు. ఈ సదస్సుకు సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి అధ్యక్షత వహించగా, నగర కార్యదర్శి విశ్వనాథ్ వందన సమర్పణ చేశారు.